కౌసల్యనగర్ పార్కు స్థలం కబ్జాపై ఫిర్యాదు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని కౌసల్యనగర్ వెంచర్‌లోని పార్కు స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికుడు ఎస్.కిరణ్ కౌన్సిల్ కార్యాలయంలో శనివారం ఫిర్యాదు చేశారు. కౌసల్యనగర్‌లో 47.07 ఎకరాల విస్తీర్ణంలో వెంచర్ ఏర్పాటు చేశారని, అందులో ప్రజల అవసరాల నిమిత్తం బస్టాండ్, ఆలయం, క్రీడా మైదానం, పాఠశాల కోసం 6,928 చదరపు గజాలు కేటాయించారని లేఖలో గుర్తుచేశారు. ప్రజల కోసం వదిలిన స్థలంలో ప్లాట్లు చేసి విక్రయించే ప్రయత్నం జరుగుతుందని, ఈ విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



ఇన్‌స్పెక్టర్ నాగరాజును సన్మానిస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్

జవహర్‌నగర్: శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని జవహర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు అన్నారు. జవహర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నాగరాజు శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ శనివారం ఇన్‌స్పెక్టర్ నాగరాజును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ఇద్రీస్‌అలీ, అనిల్‌కుమార్‌యాదవ్, లక్ష్మణ్, అనిల్‌కుమార్‌రెడ్డి, వేణు, నాయకులు రాజుయాదవ్, వినయ్‌కుమార్, మిట్టుయాదవ్, ఐలయ్య పాల్గొన్నారు.

చెరువులు మాయం

శివారు పట్టణాలు, గ్రామాల్లో పలుచోట్ల ఆక్రమణలు

- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలు
- పలు శాఖల మధ్య కొరవడిన సమన్వయం
- ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో రంగంలోకి యంత్రాంగం



చెరువు వద్ద ఓ ఇంజనీరింగ్ కళాశాలలో ఆక్రమణలను కూల్చివేస్తున్న అధికారులు(ఫైల్)

సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రేటర్ సహా శివారుల్లోని చెరువు శిఖం భూములు, నాలా స్థలాలు కబ్జాకు గురవడంతో చిన్న పాటి వర్షాలకు సమీప కాలనీలు, లోతట్టు ప్రాంతాలు, రోడ్లు ముంపునకు గురవుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే చెరువు శిఖం, నాలా స్థలాల్లో అక్రమంగా వెలసిన నిర్మాణాలను కూల్చివేయాలని ప్రభుత్వ పెద్దల నుంచి తాజాగా సంబంధిత అధికారులకు అందిన ఆదేశాల మేరకు సమన్వయంతో కార్యాచరణ దిశగా ముందడుగు వేస్తున్నారు. అలాగే అక్రమార్కులపై చర్యలకు సిద్ధమవుతున్నారు.

- కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని చిన్నదామర చెరువును అనుకొని ఉన్న భూముల్లో వెలిసిన మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడు ప్రస్తుత మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోని అక్రమ నిర్మాణాలను ఇటీవల జేసీబీలతో ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖలకు చెందిన సిబ్బంది కూల్చివేశారు. దీనికి ముందు సంబంధిత శాఖల అధికారులు చిన్న దామర చెరువు భూముల్లో తనిఖీలు నిర్వహించి, కబ్జాలు నిజమేనని నిర్ధారించిన తర్వాతే చిన్న దామరచెరువు భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను పోలీసుల సహకారంతో నేలమట్టం చేశారు. అలాగే ప్రగతినగర్ ఎర్రకుంట చెరువు, ఫాక్స్ సాగర్, దుండిగల్ చింతలకుంట చెరువు, వెన్నెలగడ్డ చెరువుల కబ్జాలపై కూడా దృష్టి సారించిన అధికార యంత్రాంగం సర్వే పనుల్లో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. త్వరలో ఇక్కడ వెలసిన అక్రమ నిర్మాణాలను కూడా కూల్చివేసేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది.

476 చెరువుల సరిహద్దులపై..

- నగర శివారు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 21 మున్సిపాలిటీలు, 619 గ్రామాల పరిధిలో 552 చెరువులు, కుంటలు ఉండగా, ఇందులో 476 చెరువులు, కుంటలు, నాలాల సరిహద్దుల ఖరారు ప్రక్రియలో భాగంగా శాటిలైట్ సర్వే నిర్వహించారు. సర్వేతో చెరువులు, కుంటలు, నాలాల సరిహద్దులను గుర్తించిన యంత్రాంగం దీనికి సంబంధించిన వివరాలను హెచ్‌ఎండీఏకు అందజేశారు. దీంతో రెవెన్యూ, నీటిపారుదల, మున్సిపల్ శాఖల యంత్రాంగం సంయుక్తంగా కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ సర్కిళ్లలో చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్ పరిధితో పాటు నాలాల్లో ఉన్న అక్రమ కట్టడాలపై చర్యలకు సిద్ధమయ్యారు. కోర్టు వివాదం(స్టే)లో ఉన్న అక్రమ కట్టడాలను మినహాయించి మిగతా వాటిపై దూకుడు పెంచాలని యోచిస్తోంది.
- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రగతినగర్ ఎర్రకుంట చెరువు అక్రమ నిర్మాణాలపై బీజేపీ నాయకులతో సహా స్థానికులు పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వే, ఇరిగేషన్ శాఖ అధికారులు కూడా ఎర్రకుంట చెరువులో కబ్జాలను ప్రాథమికంగా గుర్తించారు. లింగం చెరువు, ఫాక్స్‌సాగర్ చెరువు, వెన్నెలగడ్డ చెరువు, పరికి చెరువు, చింతలకుంట చెరువు, పత్తికుంట చెరువు ఎఫ్‌టీఎల్ భూములు కబ్జా చెరలో చిక్కుకున్నాయని ఫిర్యాదులు కూడా అధికారులకు అందాయి. దూలపల్లి సుమలచెరువు, కొంపల్లి ఊరచెరువులో మట్టి పూడ్చి వేస్తున్నారని ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- శివారుల్లో నీటి పారుదల శాఖ నిర్లక్ష్యం కారణంగా అర్థ, అంగబలంతో పాటు రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులు దర్జాగా చెరువుల ఎఫ్‌టీఎల్, నాలాల స్థలాలు కబ్జా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని బోడుప్పల్ కార్పొరేషన్‌లోని రా చెరువు, చింతల చెరువుల్లోని బఫర్ జోన్‌లో బహుళ అంతస్తుల నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఇదే పరిస్థితి దమ్మాయిగూడ, నాగారం, పీర్జాదిగూడ, ఘట్‌కేసర్ పురపాలక సంఘాల పరిధిలోని చెరువుల్లోని ఎఫ్‌టీఎల్‌లో కూడా అక్రమంగా భవనాలను నిర్మిస్తున్నారు.
- రెవెన్యూ, నీటి పారుదల, పురపాలక శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ఈ కబ్జాల పర్వం మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇదే అదనుగా భావించిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా చెరువులు, నాలా స్థలాలు ఆక్రమించి లే అవుట్లు, వెంచర్లు చేసి నిర్మాణాలు చేపట్టడంతో ఎగువ, సమీప ప్రాంతాల నుంచి వర్షాకాలంలో వచ్చే వర్షం నీటితో పాటు వరద ప్రవాహమంతా కాలనీలు, లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి చేరుతోంది.
- కొత్త ప్రభుత్వం అధికారాన్ని చేపట్టిన దరిమిలా.. గతంలో చేపట్టిన శాటిలైట్ సర్వే ఆధారంగా మరోసారి చెరువులు, కుంటల పరిధిలో ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు సర్వే కార్యక్రమాన్ని సంయుక్తంగా పరిశీలిస్తున్న రెవెన్యూ, నీటిపారుదల, పురపాలక శాఖలు ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమవుతున్నారు.

ముగిసిన సర్టిఫికెట్ కోర్సు శిక్షణ



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో వర్చువల్ రియాల్టీ, ఆగ్‌మెంటెడ్ రియాల్టీపై కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు వారం రోజుల పాటు నిర్వహించిన సర్టిఫికెట్ కోర్సు శనివారం ముగిసింది. ఐఐసీ విభాగం ఆధ్వర్యంలో ఏపీకే ఇన్ఫో సొల్యూషన్స్ నిర్వహించిన కార్యక్రమంలో గ్రాఫిక్స్, గేమ్స్‌ను ఏ విధంగా సులభంగా డిజైన్ చేయవచ్చో అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు ప్రిన్సిపాల్ అశోక్, డీన్ నర్సింహారెడ్డి, రాజేశ్వరన్ బహుమతులను ప్రదానం చేసి సర్టిఫికెట్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో వైద్య శిబిరం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మల్లారెడ్డి మెడికల్ యూనివర్సిటీ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత ప్రారంభించగా అనంతరం మల్లారెడ్డి గ్రూప్స్‌లోని పలు కళాశాలలకు చెందిన 300 మందికి పైగా అధ్యాపకులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వైద్యులు పలు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్య బృందం ఆరోగ్య సమస్యలు వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జి పవన్‌కుమార్, డీన్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులు, అధ్యాపకులు గుండ్లపోచంపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. పాఠశాల విద్యార్థులకు ఆంగ్ల భాష ఆవశ్యకత, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక యుగంలో చదువుతో పాటు ఆంగ్ల భాషపై పట్టు కలిగి ఉండాలని అన్నారు. అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లలో వెలుగులు

శామీర్‌పేట్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం ద్వారా పేదల ఇళ్లలో వెలుగులు నింపుతుందని కాంగ్రెస్ పార్టీ మూడుచింతలపల్లి మండల ప్రధాన కార్యదర్శి బండి జగన్నాథం అన్నారు. మండల పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామంలో గృహలక్ష్మీ లబ్ధిదారులకు జీరో విద్యుత్ బిల్లులను అందజేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అమలు చేశారని, కాంగ్రెస్ పార్టీ మాట తప్పని రాజకీయ పార్టీ అని వివరించారు. నాయకులు నర్సింహులు, సత్యనారాయణ, గోపి, శ్రీశైలం, బాలమణి, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్స్‌కు ఎల్లవేళలా సహకారం అందిస్తాం



అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్వేత సందిరిని అభినందిస్తున్న సెక్రటరి, ప్రిన్సిపాల్

మేడ్చల్‌రూరల్: ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్స్‌తో వచ్చే అధ్యాపకులకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామని సెయింట్ పీటర్స్ కళాశాల సెక్రటరీ టీవీ రెడ్డి తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్వేత సందిరి ఎంఎస్‌ఎంఈ న్యూఢిల్లీ వారి సహకారంతో ఐడియా హ్యాకథాన్ 3.0 ఫర్ ఉమెన్ విభాగంలో సోలార్ వైర్‌లెస్ ఎలక్ట్రిక్ వెహికల్ చార్జింగ్ సిస్టం ప్రాజెక్టు ప్రపోజల్ సమర్పించగా ఎంఎస్‌ఎంఈ ప్రపోజల్‌ను అంగీకరిస్తూ ప్రాజెక్టుకు రూ.15 లక్షల నిధులను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్వేతను సెక్రటరి టీవీ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, అకాడమిక్ డైరెక్టర్లు అనుగార్‌రెడ్డి, సరోజారెడ్డి, ఈసీఈ డీన్ ప్రసన్నకుమార్, పీఆర్వో రవిసుధాకర్, అధ్యాపకులు అభినందించారు.

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న తటాకం వెంకటేష్ తదితరులు

కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో 6 నుంచి 11వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ప్రత్యేక పూజలకు హాజరు కావాలని కోరుతూ శనివారం కీసరగుట్ట దేవాలయ వంశపారంపర్య ధర్మకర్త తటాకం వెంకటేష్ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్ర మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్‌మున్సి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతమహేందర్‌రెడ్డిలను కోరారు. బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు.

శామీర్‌పేట సీఐ బదిలీ

శామీర్‌పేట్: శామీర్‌పేట పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ శనివారం బదిలీ అయ్యారు. శామీర్‌పేట పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించిన నిరంజన్‌రెడ్డి నార్సింగి ట్రాఫిక్ సెక్టార్‌కు బదిలీ అయ్యారు. కాగా శంషాబాద్ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న సన శ్రీనాథ్ శామీర్‌పేట ఎస్‌హెచ్‌ఓగా విధులు చేపట్టనున్నారు.

తైబజార్ వేలం.. రూ.3.23 లక్షలు

కీసర: కీసరగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్టలో (తాత్కాలిక స్టాల్) తైబజార్ వసూలు చేసుకునేందుకు శనివారం కీసర గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన తైబజార్ బహిరంగ వేలం పాటను కీసర గ్రామానికి చెందిన రాగుల రమేష్‌ముదిరాజ్ రూ.3.23 లక్షలకు దక్కించుకున్నాడు. వేలం పాట దక్కించుకున్న రాగుల రమేష్‌ముదిరాజ్ ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు కీసరగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్టలో ఏర్పాటు చేసే తాత్కాలిక స్టాల్స్ ఏర్పాటు చేసే వ్యక్తుల నుంచి గ్రామపంచాయతీ అధికారులు నిర్దేశించిన తైబజార్ రుసుము వసూలు చేసుకోవడానికి వీలుంటుందని అధికారులు తెలిపారు.

ప్రభుత్వ స్థలానికి రూ.1.5 కోట్ల డీల్

ఘట్‌కేసర్: ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు కోటిన్నరకు డీల్ చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ రెండో వార్డు కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవి డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో సర్వే నంబర్-127/బిలోని 1.39 గుంటల సీలింగ్ భూమిలో ఏర్పాటు చేసిన నర్సరీని ఖాళీ చేయించేందుకు కందకట్ల మాధవరెడ్డితో వారు రూ.1.5 కోట్లకు డీల్ కుదుర్చుకున్నారని ఆరోపించారు. డబ్బులకు కక్కుర్తిపడి ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూసిన వారికి అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై త్వరలో రాష్ట్ర మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఎంపీడీఓ వీడ్కోలు సమావేశం



ఎంపీడీఓ అరుణారెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ గీతారెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన శనివారం ఎంపీడీఓ అరుణారెడ్డికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి హాజరయ్యారు. ఘట్‌కేసర్ ఎంపీడీఓగా పనిచేసిన అరుణారెడ్డి సంగారెడ్డి జిన్నారం మండలానికి బదిలీ కాగా వలిగొండ మండల ఎంపీడీఓ గీతారెడ్డి ఘట్‌కేసర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా అరుణారెడ్డికి వీడ్కోలు, గీతారెడ్డికి స్వాగతం పలికారు. పూలమాల, శాలువాతో సన్మానించి పుష్ప గుచ్ఛం అందజేశారు. వైస్ ఎంపీపీ జంగమ్మ, ఎంపీఓ నందకిశోర్, ఎంపీటీసీలు సరళ, శోభారాణి, వినోద, రామారావుముదిరాజ్, భాస్కర్‌రెడ్డి, రవి, మాజీ సర్పంచులు శివశంకర్, వెంకటేశ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, యాదగిరి, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఏఈ యాదగిరి, సీనియర్ అసిస్టెంట్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ సమ్మర్ క్యాంపు



ఘట్‌కేసర్: విద్యార్థుల జీవితాలను ఎన్‌ఎస్‌ఎస్ ఉన్నత లక్ష్యం వైపు తీసుకెళ్తుందని యూత్ ఆఫీసర్ సైదా రామావత్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1, 4 దత్తత గ్రామాలు అవుషాపూర్, ఎదులాబాద్‌లో వారం రోజులుగా నిర్వహించిన సమ్మర్ స్పెషల్ క్యాంపు ముగింపు వేడుకలకు శనివారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనుపమ, ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ మల్లేశ్, డాక్టర్ శ్రీనివాస్, అగ్రికల్చర్ డీన్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.



వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ

మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



జవహర్‌నగర్‌లో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేయర్ కావ్య తదితరులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ ముత్తుస్వామి కాలనీలో శివాజీ మహరాజ్ యూత్ ఆధ్వర్యంలో శనివారం ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేయర్ కావ్య, కార్పొరేటర్ జిట్టా శ్రీవాణిశ్రీనివాస్ రెడ్డి హాజరై శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. వీరత్వానికి ప్రతీక, స్ఫూర్తి ప్రదాత ఛత్రపతి శివాజీ అన్నారు. యువత ఛత్రపతి శివాజీ మహరాజ్ ధైర్య సాహసాలను స్ఫూర్తిగా తీసుకొని మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంగీతరాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, బీఆర్‌ఎస్ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్, నాయకులు మెట్టు వెంకన్న, మహేష్, బండకింది ప్రసాద్, భూమా పాల్, వెంకటేష్, శివాజీ మహరాజ్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ అసెంబ్లీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకొని శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జ్యోతి ప్రజ్వలన చేసి, ఆయన చిత్రపటానికి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల శాఖ నిర్వహించిన సైక్లింగ్ పోటీల్లో విజేతలకు అదనపు కలెక్టర్, డీఆర్‌ఓ హరిప్రియ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ దిలీప్ కుమార్, డీఆర్డీఏ పీడీ సాంబశివరావు, యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ బలరామారావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయాలి



సాక్షి, మేడ్చల్ జిల్లా: నిర్ణీత గడువులోపు ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించేందుకు ఈ నెల 9 వరకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన స్పెషల్ డ్రైవ్‌పై అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతు ధరణి పోర్టల్ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఏ విధంగా పరిష్కరించాలనే విషయంపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, ధరణి ఆపరేటర్లకు అవగాహన కల్పించారు. పెండింగ్ ఉన్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి, అవసరమైతే ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ చేసి ఆన్‌లైన్‌లోనే కాకుండా ఫైల్స్ రూపంలో కూడా నిర్వహించాలని తహసీల్దార్లను ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ధరణి ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు



మాట్లాడుతున్న డాక్టర్ రఘునాథస్వామి

కీసర: అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల వయస్సు ఉన్న పిల్లలందరికీ తల్లిదండ్రులు తప్పకుండా పల్స్‌పోలీయో చుక్కలు వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.టి.రఘునాథస్వామి అన్నారు. శనివారం కీసర పీహెచ్‌సీని సందర్శించిన ఆయన ఆదివారం పల్స్ పోలీయో కార్యక్రమం సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి వైద్యాధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కీసరగుట్టను సందర్శించి బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసర జాతర ప్రదేశాలను పరిశీలించారు. అత్యవసర వైద్య శిబిరాలకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. డాక్టర్ మునుపప్పన్, డాక్టర్ స్వప్నరెడ్డి, కీసర మండల వైద్యాధికారి డాక్టర్ సరితారెడ్డి, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాగారం మున్సిపాలిటీ బడ్జెట్ రూ.38.91 కోట్లు



సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం పురపాలక సంఘం అంచనా బడ్జెట్‌ను పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించినట్లు చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో కౌకుట్ల చంద్రారెడ్డి అధ్యక్షతన శనివారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన రూ.38.91 కోట్ల అంచనా బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదిస్తూ తీర్మానం చేసిందన్నారు. ఇందులో పన్నుల ద్వారా, అనుమతుల ద్వారా రూ.32 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. స్టేట్, సెంట్రల్ గవర్నమెంట్ గ్రాంట్స్ ద్వారా, డిపాజిట్స్, రుణాల ద్వారా మొత్తం రూ 38.99 కోట్ల ఆదాయం సమకూరుతుందన్నారు. అభివృద్ధి, ఇతర ఖర్చుల కోసం రూ.38.91 వెచ్చిస్తున్నట్లు, రూ.8 లక్షలు మిగులు బడ్జెట్ ఉంటుందని అంచనా వేసినట్లు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులు నిత్య విద్యార్థులుగా ఉండాలి



అవార్డు అందుకుంటున్న సీఎంఆర్‌సెట్ అధ్యాపకుడు మునిని వెంకటేశ్వర్లు

మేడ్చల్‌రూరల్: అధ్యాపకులు నిత్య విద్యార్థులుగా ఉండాలని, ప్రస్తుత సమాజంలో మారుతున్న నూతన టెక్నాలజీ గురించి విద్యార్థులకు బోధించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌టీసీ కళాశాలలో ఏఐ ఎంఈఆర్‌ఎస్ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. దేశవ్యాప్తంగా 400 మంది అధ్యాపకులకు అవార్డులు అందజేయగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 30 కళాశాలకు అవార్డులు వరించాయి. కార్యక్రమంలో సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు దీక్షితులు, సాయిబాబా గౌడ్, మంజుల అనగాని, ఏఐఎంఈఆర్‌ఎస్ కన్వీనర్ శ్రీకాంత్ చింతకింది, రిటైర్డ్ ఐఏఎస్ చక్రపాణి, మల్లారెడ్డి యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి, ఇంపాక్ట్ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ గంప నాగేశ్వర్ రావు, సీఎంఆర్‌టీసీ డైరెక్టర్ రాజిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌సెట్, ఎంఆర్‌ఐటీఎస్ అధ్యాపకులకు అవార్డులు..

సీఎంఆర్ కళాశాలలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాల అధ్యాపకుడు మునిని వెంకటేశ్వర్లుకి స్టూడెంట్ మెంటర్‌షిప్ అండ్ డెవలప్‌మెంట్ అవార్డు దక్కగా, మైసమ్మగూడలోని ఎంఆర్‌ఐటీఎస్ కళాశాలకు చెందిన రవీంద్రకు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు దక్కింది.

మరోసారి విహార యాత్రకు మేడ్చల్ కౌన్సిలర్లు



మేడ్చల్: సొంత పార్టీ కౌన్సిలర్లు ఎక్కడ తిగబడతారో అనే భయంతో చైర్మన్ పోస్టుల్లో ఉన్న వారికి భయం పట్టుకోవడంతో కౌన్సిలర్ల కోరికలను తీర్చడంతో పాటు వారిని రొటీన్ జీవితం నుంచి లైఫ్ ఎంజాయ్ చేయడానికి మేడ్చల్ కౌన్సిలర్లు మరోసారి విహార యాత్ర బాటపట్టారు. మేడ్చల్ కౌన్సిల్‌లో బీఆర్‌ఎస్‌కు సంపూర్ణ మెజార్టీ ఉన్నప్పటికీ కొంతమంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు మొదటి నుంచి తిరుగుబావుట ఎగురవేస్తుండటంతో నాయకుల అసమ్మతిని చల్లార్చేందుకు ఎప్పటికప్పుడు నజరానాలు ఇస్తూ ఎంజాయ్ ట్రిప్పులకు తిప్పుతున్నారు. శనివారం మేడ్చల్ మున్సిపల్ కౌన్సిల్‌కు చెందిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, మహిళా కౌన్సిలర్ల భర్తలు గ్రూపుగా గోవాకు బయలుదేరి వెళ్లారు. బీఆర్‌ఎస్‌కు చెందిన కౌన్సిలర్ మణికంఠ, హరికృష్ణ యాదవ్ మినహా మిగతా 13 మంది గోవాకు వెళ్లారు.